గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులను ఈ ఏడాది కష్టనష్టాలు వెంటాడాయి. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలతో కుదేలైన అన్నదాతలను కొత్తగా వచ్చిన ప్రభుత్వమూ మరింత కుంగదీసింది. గత కేసీఆర్ ప్రభుత్వం కొనసాగించిన రైతుబంధు పంటల పెట్టుబడి సాయాన్ని అందించలేదు. పైగా తాము పెంచి ఇస్తామంటూ గొప్పలు చెప్పిన రూ.15 వేల రైతుభరోసాకు ఎగనామం పెట్టింది. ఒక్కో ఎకరానికి రూ.30 వేల మేర పెట్టుబడి పెట్టి ఉన్న రైతులకు వానకాసం సీజన్ ముగిసినా సాం ఇవ్వకుండా వెన్నుచూపి వెక్కిరించింది. చివరికి రుణమాఫీ కూడా సక్రమంగా పూర్తిచేయకుండా కర్షకులను నట్టేట ముంచింది. ఈ క్రమంలో అన్ని విధాలా గుల్ల అయిన అన్నదాతలకు అప్పలు మరింత పెరిగాయి. పైగా ఇప్పుడు మొదలవుతున్న యాసంగికి కూడా రైతుభరోసా అందుతుందో లేదోనన్న ఆందోళన నెలకొంది. వానకాలానికి పంటల పెట్టుబడి సాయం ఇవ్వని కారణంగా ఒక్క ఖమ్మం జిల్లా రైతులపైనే సుమారు రూ.400 కోట్ల ఆర్థిక భారం పడడం ఆందోళన కలిగించే అంశంగా ఉంది.

- ‘పెట్టుబడి’ అందక, రుణమాఫీగాక ఆర్థిక భారం
- వానకాలం ‘భరోసా’ లేక రూ.400 కోట్ల అప్పులు
- ఇటు వెనువెంటనే దెబ్బ తీసిన ప్రకృతి వైపరీత్యాలు
- అన్నింటా నలిగి కుదేలైన ఉమ్మడి జిల్లా అన్నదాతలు
- ఒక్కో ఎకరానికి రూ.30 వేల మేర పెట్టుబడి నష్టం
- అయినా రూ.10 వేలే పరిహారం అంటూ ప్రభుత్వ పరిహాసం

# క[న]ష్టాల సాగు


దుమ్ముగూడెంలో ఎండిపోయిన వరి పంట

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, అక్టోబర్ 2: కాంగ్రెస్ సర్కారు కారణంగా నాగార్జునసాగర్ నుంచి సాగునీళ్లు రాకపోవడతో ఖమ్మం జిల్లాలోని దాని ఆయకట్టు రైతులు నిరుడు పంటలు వేయలేదు. ధైర్యం చేసి కొందరు రైతులు వేసిన పంటలన్నీ ఎండిపోయాయి. కనీసం తాగునీరు కూడా సరిపడా అందని దుస్థితి. దీంతో వరి దిగుబడులు తగ్గిపోయాయి. ఈ గుణపాఠం కారణంగా ఈ వానకాలంలో సాగుకు దూరంగా ఉందామని ఇక్కడి రైతులు నిర్ణయించుకున్నారు. అయితే సకాలంలో రుతుపవనాలు రావడం, వర్షాలు కురవడం వంటి కారణాలతో ఊరట చెందిన అన్నదాతలు అనతి కాలంలోనే మేల్కొని 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. ఇందులో వరి, పత్తి పంటలే రికార్డు స్థాయిలో 4 లక్షల ఎకరాల్లో ఉన్నాయి. తీరా పెసర పంట చేతికొచ్చే సమయానికి అతి భారీ వర్షాలు కురిశాయి. వరదలు ముంచెత్తాయి. ఫలితంగా వానకాలం పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెసర పంట చేతికి రాకుండా పోయింది. జిల్లాలో 70 వేల ఎకరాల్లో పంటలకు నష్టం కలిగిందంటూ ప్రాథమిక సర్వేలో చెప్పిన వ్యవసాయ అధికారులు.. ఆ తరువాతి సర్వేలో కేవలం 27 వేల ఎకరాల్లోనే నష్టమంటూ ప్రభుత్వానికి నివేదిక పంపారు.

### ఒక్కో ఎకరానికి రూ.30 వేల మేర పెట్టుబడి

వానకాలం సీజన్‌లో ఖమ్మం జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టిన రైతులు.. ఒక్కో ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. రెండో ప్రధాన పంట అయిన పత్తిని మరో 2 లక్షల ఎకరాల్లో సాగుచేస్తూ ఒక్కో ఎకరానికి రూ.35 వేల మేర పెట్టుబడి పెట్టారు. ఇంత పెద్దమొత్తంలో సాగవుతున్న పంటలు దెబ్బతిన్నప్పటికీ కేవలం 27 వేల ఎకరాల్లోనే పంటల దెబ్బతిన్నట్లు ప్రభుత్వం చెబుతోంది. కాగా, ఒక్కో ఎకరానికి రైతులు రూ.30 వేల మేర పెట్టుబడి పెట్టిన రైతులకు ప్రభుత్వం రూ.10 చొప్పున పరిహారమిస్తామంటూ ప్రకటించింది. కేవలం రూ.27 కోట్ల పరిహారం ప్రకటించి చేతులు దులుపుకుంది. దీంతో మిగిలిన నష్టాన్నంతా అన్నదాతలే భరించాల్సి వస్తోంది. దీనికి తోడు వరదలు మిగిల్చిన మేటల తొలగింపు భారం కూడా కర్షకులపైనే పడుతోంది. ఈ మేటల తొలగింపు కోసం ఒక్కో ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకూ ఖర్చయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఇక 33 శాతం పంట నష్టం జరిగితేనే పరిహారమంటూ ప్రభుత్వం ప్రకటించించడంతో ఆ లోపు పంటలు దెబ్బతిన్న రైతులందరూ పూర్తిగా నష్టపోవాల్సి వస్తోంది. వీరు సుమారు 50 వేల మంది వరకూ ఉండే అవకాశముంది.

### రైతు బంధు అందక రూ.400 కోట్ల భారం

2023 గణాంకాల ప్రకారం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వానకాలం సీజన్‌కు 3.08 లక్షల మంది రైతులకు ఒక్కో ఎకరానికి రూ.5 వేల చొప్పున సుమారుగా రూ.360 కోట్ల రైతు బంధు పంటల పెట్టుబడి సాయాన్ని అందించింది. అయితే తాము ఒక్కో సీజన్‌కు ఎకరానికి రూ.7500 చొప్పున అందిస్తామంటూ చెప్పిన కాంగ్రెస్ సర్కారు ఈ సీజన్ ముగిసినా ఇవ్వలేదు. దీంతో రైతుభరోసా పేరిట పెంచిన సాయం రూ.400 కోట్ల మేర ఇవ్వాల్సి ఉండగా మొత్తానికే ఎగనామం పెట్టింది. దీంతో ఆ మొత్తమంతా రైతులు అప్పులతో సమకూర్చుకోవడంతో ఆ భారమంతా వారిపైనే పడింది. మరి యాసంగి సీజన్ సంగతిని ఏం చేస్తారో చూడాలి మరి.

### ‘భద్రాద్రి’ అన్నదాత ఆగమాగం

కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాకు మంగళం పాడడంతో భద్రాద్రి జిల్లా రైతులు ఆగమాగమయ్యారు. ముఖ్యంగా పోడు పట్టాలు పొందిన ఏజెన్సీ రైతులు అష్టకష్టాలు పడ్డారు. జిల్లా రైతులు ఈ వానకాలం సీజన్‌లో 4,77,538 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. అందులో 1,61,731 ఎకరాల్లో వరి; 1,98,268 ఎకరాల్లో పత్తి; 81,242 ఎకరాల్లో జొన్న పంటలు వేశారు. దీంతో సమయానికి పెట్టుబడి సాయం అందకపోవడంతో అధిక మొత్తంలో అప్పులు తెచ్చుకున్నారు. సీజన్ ముగిసినా సాయం అందకపోవడంతో అప్పులు, వడ్డీలు పెరిగిపోయాయి. దీనికితోడు ప్రకృతి విపత్తులు కూడా అన్నదాతలను వెంటాడడంతో వారు అప్పుల ఊబిలో చిక్కుకుపోయారు.

### ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం..



ఈ ఏడాది మా ప్రాంతంలో వర్షాలు మంచిగా కురిసి పంటలు బాగున్నాయి. కానీ సరైన సమయంలో పెట్టుబడి సహాయం అందలేదు. అదీకాక రుణమాఫీ కూడా కాలేదు. దీంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. పనులు వదులుకొని బ్యాంకుల చుట్టూ, పెట్టుబడులకు అప్పు ఇచ్చేవారి చుట్టూ తిరుగుతున్నాం. గత ప్రభుత్వం పెట్టుబడి సహాయం సమయానికి అందించడం వల్ల దర్జాగా వ్యవసాయం చేశాం. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ, రైతుభరోసా వెంటనే ఇవ్వాలని కోరుతున్నాం.

**– పాపావత్ రాందాస్, రైతు, మద్రాస్ తండా గ్రామం, టేకులపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

### ఈ ఏడాది ఆశాజనకంగా లేదు



ఈ సంవత్సరం వ్యవసాయం ఆశాజనకంగా లేదు. కాలం కూడా అనుకూలించేలా లేదు. వర్షాలు పడకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. రైతు భరోసా కూడా అందక అప్పులు చేసి నానా అవస్థలు పడుతున్నాం. ఇప్పటికే అప్పులు చేసి చాలా పెట్టుబడి పెట్టి ఉన్నాం.

**– సున్నం మునేష్, రైతు, పుట్టతోగు గ్రామం, ములకలపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

## పది నెలలైనా పింఛన్ ఇవ్వట్లేదు ‘బాపూ’..

### ఖమ్మంలో పలువురు వృద్ధుల నిరసన.. గాంధీ చిత్రపటానికి వినతి..


గాంధీ చిత్రపటం వద్ద వినతిపత్రం చూపిస్తున్న పింఛన్ దరఖాస్తుదారులు

ఖమ్మం, అక్టోబర్ 2:‘కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు అవుతున్నా మాకు సామాజిక పింఛన్లు కూడా ఇవ్వట్లేదు బాపూ..’ అంటూ ఖమ్మంలోని పలువురు వృద్ధులు, వితంతువులు, దివ్యాగులు ఆవేదన వ్యక్తం చేశారు. ‘ఇప్పటికైనా మాకు పింఛన్లు మంజూరు చేయించేలా ప్రభుత్వానికి స్ఫూహ కల్పించండి మహాత్మా..’ అంటూ వేడుకున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు అవుతున్నా తమకు ఆసరా పింఛన్లు మంజూరు చేయడంలేదంటూ ఖమ్మం నగరంలోని 25వ డివిజన్‌కు పలువురు వృద్ధులు, వితంతువుల, దివ్యాంగులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. గాంధీ జయంతి కూడా కావడంతో డివిజన్‌లోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడే మహాత్ముడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ మేరకు అదే చిత్రపటానికి తమ పింఛన్ దరఖాస్తులను అందించి నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారిలో కందుకూరి ప్రదీప్‌కుమార్, ఎండీ అన్వర్, శ్రీను, తంగిశెట్టి అనసూయమ్మ , విజయలక్ష్మి, ముళ్లపాటి నాగమణి, బోనగిరి నాగమణి తదితరులు ఉన్నారు.

## అహింసామార్గం అనుసరణీయం

- మహాత్ముడి జీవన విధానం ఆదర్శం
- జాతిపిత జయంతి వేడుకల్లో వక్తలు


తెలంగాణభవన్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు సండ్ర తదితరులు


జాతిపితకు నివాళులర్పిస్తున్న కలెక్టర్


బాపూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఖమ్మం సీపీ


మహాత్ముడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో

ఖమ్మం, అశ్వాపురం/ మామిళ్లగూడెం/ భద్రాచలం, అక్టోబర్ 2 : మహాత్ముడి జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు. ఆయన సాగించిన అహింసామార్గం అందరికీ అనుసరణీయమని అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అతి సామాన్య కుటుంబంలో జన్మించిన మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ.. ప్రపంచ అత్యున్నత విశ్వవిద్యాలయం నుంచి లా డిగ్రీ పూర్తిచేశారని గుర్తుచేశారు. శాంతి, అహింసామార్గం ద్వారానే దేశ స్వాతంత్రోద్యమాన్ని ముందుకు నడిపించారని జ్ఞప్తికి తెచ్చారు. కాగా, బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేశ్ వి పాటిల్, భద్రాచలంలో ఐటీడీఏ పీవో రాహుల్, ఖమ్మంలో సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తదితరులు మహాత్ముడి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### కేసీఆర్ నాయకత్వంలోనే గ్రామ స్వరాజ్యం

**సత్యం, అహింస అనే ఆయుధాలతో రాష్ట్ర సాధన: బీఆర్‌ఎస్**

గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం ఉద్యమనేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమైందని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొన్నారు. సత్యం, అహింస అనే ఆయుధాలతో స్వరాష్ట్రాన్ని సాధించిన ఘనత ఉద్యమసారథి కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తుచేశారు. గాంధీ జయంతి సందర్భంగా ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో బాపూ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ నేతలు, ఉద్యమకారులు సండ్ర వెంకట వీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, పగడాల నాగరాజు, కూరాకుల నాగభూషణం, ఆర్‌జేసీ కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, తాళ్లూరు జీవన్‌కుమార్, జ్యోతిరెడ్డి, తాజుద్దీన్, దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

- ఉమ్మడి జిల్లాలో వైభవంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం
- తొలి రోజు ఎంగిలిపూలతో సందడి చేసిన మహిళామణులు
- బీఆర్‌ఎస్ కార్యాలయాలు సహా ప్రభుత్వ శాఖల్లో సంబురాలు

## ఆ సింగిడిలో రంగులనే దూసి తెచ్చి..

# బంగారు బతుకమ్మను ఇంటిల పేర్చి..

### తొమ్మిది రోజులూ పూలపండుగ.. ప్రకృతితో మమేకమే ఇక..





భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం, అక్టోబర్ 2: ‘ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మ.. తంగేడు పువ్వొప్పునే గౌరమ్మ.. తంగేడు కాయొప్పునే గౌరమ్మ..’ అంటూ బతుకమ్మ గీతాలు మార్మోగాయి. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల్లో భాగంగా బుధవారం తొలిరోజు పూలపండుగ సంబురాలు మొదలయ్యాయి. ఎంగిలిపూల బతుకమ్మలను అందంగా అలంకరించుకొని వచ్చిన మహిళామణులు.. వాటిని ఒక చోట చేర్చారు. చప్పట్లు, నృత్యాలు, బతుకమ్మ గీతాలతో ఆడిపాడి సందడి చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ బతుకమ్మ పండుగను అధికారికంగా జరపడంతో ఈ సంబురాలకు మరింత ఆదరణ పెరిగింది. అదే సంప్రదాయంతో ఉమ్మడి జిల్లాలోని మహిళలందరూ బతుకమ్మ సంబురాలను పండుగలా జరుపుతున్నారు. తొలి రోజు నాటి ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలు ఊరూవాడల్లో అంబురాన్నంటాయి. రాత్రి వరకూ బతుకమ్మ ఆడిన మహిళలు.. అనంతరం స్థానిక చెరువులు, కుంటలు, వాగుల్లో వాటిని నిమజ్జనం చేశారు. భద్రాద్రి జిల్లా కేంద్రంలోని ముర్రేడు వాగు వద్ద ఆడబిడ్డలు ఆడిన బతుకమ్మ ఆటలు ఆకట్టుకున్నాయి.

**‘ఎంగిలిపూల’తో ఆరంభం..**

తొమ్మిది రోజులపాటు సాగే ఆటపాటల బతుకమ్మ పూలపండుగ బుధవారం ఎంగిలిపూలతో ఆరంభమైంది. ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో కేఎంసీ, మెప్మా మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక సంఘం సభ్యులు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మహిళా ఉద్యోగులు, నగర మహిళలు కలిసి కేఎంసీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులందరినీ ఒక దగ్గరికి చేర్చి.. ప్రకృతితో మమేకమయ్యేలా చేసే పండుగ బతుకమ్మ అని గుర్తుచేశారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను తెలంగాణ ఆడబిడ్డలందరూ ఆనందంగా జరుపుకుంటున్నారని అన్నారు. డీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి, కేఎంసీ సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, మహిళా అధికారులు, ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకలకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, మాటేటి కిరణ్‌కుమార్, భారతి, నిరోషా, బిచ్చాల తిరుమలరావు, కొల్లు పద్మ, ఉద్యమకారులు దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం 51వ డివిజన్‌లో హనుమాన్ గుడి వద్ద కార్పొరేటర్ శీలంశెట్టి రమ ఆధ్వర్యంలోనూ పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.


ఖమ్మంలోని తెలంగాణభవన్‌లో వేడుకలు ప్రారంభిస్తున్న ఆర్‌జేసీ కృష్ణ


కేఎంసీలో భారీ బతుకమ్మ..


ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో బతుకమ్మలతో ఆడబిడ్డలు


జూలూరుపాడులో బతుకమ్మ ఆడుతున్న స్థానిక మహిళలు


గుండాల మండలంలో బతుకమ్మ వద్ద ఆడుతున్న మహిళలు


ఖమ్మం తెలంగాణ భవన్‌లో..


కొత్తగూడెం పట్టణంలో బతుకమ్మ వద్ద ఆడుతున్న ఆడబిడ్డలు


ఖమ్మంలోని కేఎంసీ ఆఫీసులో..


ఖమ్మం బీఆర్‌ఎస్ ఆఫీసులో..


కొత్తగూడెం అర్బన్: బతుకమ్మ వద్ద ఆడుతున్న పట్టణ మహిళలు


నగరంలో బతుకమ్మలు తీసుకొస్తున్న మహిళలు


బతుకమ్మలతో వేదిక వద్ద వస్తున్న ఆడబిడ్డలు


హార్వెస్ట్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు